# రెడ్డోచ్చె మొదలెత్తుకో

**కథానిక**

## వై. సి. వి. రెడ్డి

దేవుడుంటే యిట్లెందుకవుతుంది? ఒక పిల్లది మూగిది. యింకొకపిల్లది చెవిటిది. పెండ్లాము చూస్తామా అంటే పూసుకాళ్ళది, శక్తిలేనది ఏ పనీ అలుపు లేకుండా చేయలేదు. చిన్నా పెద్దా కలసి ఆరు మంది పిల్లోల్లతో అస్తులా పస్తుల్తో ఆరిపోతావుంది. మొగడున్నాడు వానికి వూరూలేదు పేరూలేదు. యిల్లూలేదు వాకిలీలేదు. ఏ గోడ కిందనో ఏ చెట్టు కిందనో పడుండాల. రోగిష్టి భార్యతో, ఎత్తుతెలియని పిల్లోల్లతో బతుకులో బండ లేసుకోవాల. వాడు మామూలు మనిషి. వానికి మామూలు కూళ్ళిస్తారు. పనిచేత కాదని సాకుపెట్తారు. మూగిదీ చెవిటిదీ ఆడపిల్లలు, పనికెదిగినారు కాబట్టి సరి పోయింది. వాళ్ళింత తెస్తారు. వాళ్ళే దిక్కు ముసిలోల్లకు. వూరుకోకుండా పని చేస్తారు. ఎటొచ్చి యిన్ని గింజలు తెస్తారు. పనిలేని దినాల్లో నాలి పనిచేసి యింత బువ్వ తెస్తారు. సెరి రెండు ముద్దలు సంగటిని సంపాదిస్తారు. ఎవరెవరు ఎంత తింటారో ఎట్ల పంచుకొంటారో తెలియదు.

ఎవరిని చూచినా పని చూపించమని సైగల్తో మూగిపిల్లని అడుగుతుంది. ఏమి చెప్పుతాడా అని వాళ్ళ నోటిదిక్కు చూస్తూ ఉంటుంది చెవిటి పిల్ల. పెద్దోళ్ళిద్దరూ మాలోకం పడి దిక్కుతెలియని స్థితిలో ఆలోచిస్తూ వుంటారు. చిన్న పిల్లోల్లు దిక్కు దిక్కునచూస్తూ ఏమైనా తెస్తారేమో, తెచ్చినారేమోనని అక్కగారి దిక్కుగా ఆశగా చూస్తూంటారు. వాళ్ళందరికీ మానాన్ని సరిగా కాపాడుకోడానికి బట్టలు లేవు. అన్నీ అడక్కచ్చుకొన్న చింపిరి బట్టలే. నేను వూళ్లో ఉన్నప్పుడు ఆ పేద కుటుంబాన్ని చూచినాను. ఒకటి రెండు దపాలు తోచింది యివ్వడమూ జరిగింది.

కుటుంబ పెద్ద గంగడు. చేతనైనంతా పనిచేస్తాడు. పేడాకసువూ-పొట్టూ సొప్పా, దంచేది యిసిరేది, ఏదో చిన్న చిన్న పనులు చేసేదికాక-వరుపుసేద్యాలకు నీళ్ళకాడికీ-గడ్డితీయనూ-పోతాడు. వానికి బతికేది చేతకాదు. మూగి చెవిటి పిల్లల్తో, రోగిష్టి భార్యతో యింకా నలుగురు ఎత్తుతెలియని పిల్లోల్లతో ఎట్లాబతుకుతున్నాడో-పాపం - అని అనుకొనే వాన్ని. ఎండిన కట్టె, ఎప్పుడు రాలి పోతుందో అన్నట్లుంది వాని పెండ్లాం. నాకు జూడ-పిల్లోల్లు తెనియనోల్లనీ, మూగి, చెవిటీ అని-వారి మీద ఆధార పడి బతుకుతున్నామే అని-ఆమె ఆ స్థితికి వచ్చిందేమో. వాళ్ళుతెచ్చే తిండి తినలేక కుములుకొని అట్లా చిక్కి శల్యమైందేమో! అప్పుడప్పుడు సన్నని పిల్లోల్లను చూచి కుములుకొని కుములుకొని ఏడ్చుకొంటూ వుంటుందంట. ఆ మాట మొగుడే చెప్పినాడు.

ఆ కుటుంబమంతా ఎక్కువగా గోవింద రెడ్డి యింట్లో పనిచేస్తూ వుంటారు. అతను ఎంత కూలిస్తే అంత, గంగడు మాత్రం-గాడి ఏట లూడ్చి-పోట్టూ సొప్పా తెచ్చి యిస్తూ వుంటాడు. ఆ పని నిత్యం చేయాల్సిందే. ఎవరి పనికి పోవాలన్నా-పై పనులు విధిగా చేసి పోవాల్సిందే.

ఊడిపడినట్లు గంగడు వచ్చినాడు. అప్పుడే లేచి మొగం కడుక్కుంటున్నా- "ఏరా గంగా బాగున్నావా" అని అన్నాను.

"మీ దాపున్నే బతుకు బాబ్బా. ఆవూల్లో బతకలేను." అని కంట నీరు పెట్టుకొన్నాడు. 'ఛ' ఏడ్చేదెందుకురా-కూర్చో అని "నీ పెండ్లామూ పిల్లోలూ బాగున్నారా" అని అన్నాను.

"అందరం వచ్చినామబ్బా, రాత్రి రైల్లో టిక్కట్లు లేకుండా ఎట్లో వచ్చినాం. పక్కన అర స్టేషన్‌లో దింపినారు. అక్కడి నుండి నడిచి వచ్చినాం" అని గొంతు కూర్చొన్నాడు.

"ఏరీ వాళ్ళెక్కడున్నారు పిల్చుకోని రాపో." అని తరిమినాను. నా మాటల్లో ఆదరించే ధోరణి కనపడిందేమో ఉత్సాహంగా పరిగెత్తినట్లు పోయినాడు. నాకూ దిక్కు తెలియని టౌన్లో ఎట్లా యీ కుటుంబాన్ని ఆదుకొనేది. "వీనికి ఏ పని చేతకాదే-ఎట్లబ్బా" అని ఆలోచిస్తూ కూర్చున్నాను. తోటకాడికి పంపిస్తే అని ఆలోచన వచ్చింది. పంపి ఏం లాభం స్వంత సేద్యం లేదే. అక్కడా ఒకయ్యకు పనికి పోవాల్సిందే ఉండూరు కాదు. వానికి వాని పిల్లోల్లకూ పని ఎవరు చూపిస్తారు. అని తీవ్రంగా ఆలోచిస్తూ ఏమైనా తోట వద్దకే పంపాలని అనుకొన్నాను. అంతలో అందరూ వచ్చినారు. నేను మొదట చూచింది భార్యను. ఏముంది పాపం చిక్కిపోయింది. వట్టికట్టె. పానముంది అంతే మూగిపిల్ల చెవిటిపిల్లా నన్ను చూచి నవ్వు ముఖాలు పెట్టినారు. చిన్న పిల్లోల్లు-యింట్లో ఉన్న కుర్చీలు మంచాలూ చూస్తున్నారు. టేబుల్ మీద ఉన్న గడియారాన్ని చూచి-టిక్ టిక్ మనే శబ్దానికి ఆశ్చర్యపోతున్నారు.

వెంటనే తిండి తీర్థాలు ఏర్పాటు చేసి-తోటకాడికి పోండని చెప్పి-బస్సు చార్జీలు యిచ్చి-అక్కడున్న - తోట గుత్తకు చేస్తున్న సన్నకారు రైతు రామిరెడ్డికి ఒక జాబు రాసి పంపినాను. ఒక పెద్ద బరువుదించు కొన్నట్లయింది. సెడ్డులోనే వుండమనీ-పనులు చూపించమనీ-జాబులోని సారాంశం. ఆరోజంతా-ఎట్లా బతుకుతారో పాపం-ఏదో ఒక సాకుపెట్టి సెడ్డులోంచి వెళ్ళగొట్టుతారేమో-పనులు సరిగా చూపరేమో-కూళ్ళు సరిగా యివ్వరేమో-అని ఒకటే ఆలోచనతో గడిచింది.

నాలుగు రోజులు తోటవద్దవుండి. గంగడు వచ్చినాడు. "ఏరా గంగా సెడ్డులోనే వున్నారా-పనులు దొరుకుతా వున్నాయా-రామిరెడ్డికి జాబు యిచ్చి

నావా - పరవాలేదా - అక్కడవుండగ లదా"-అని అడిగినాను.

"రామిరెడ్డి మంచోడబ్బా. ఆ రాత్రికి అన్నం పెట్టించినాడు. సెడ్డులోనే వుండరా తర్వాత చూస్తాం - మీయిళ్ళ ల్లోనే కుదిరితే కొట్టం చూస్తాంలేరా" అని చెప్పి నాడబ్బా, అని అన్నాడు గంగడు.

"ఏరా మనసెడ్డుబాగుందే. గాలి వానలకు ఆటుకొంటుంది. అక్కడే వుండరా. వూర్లోకిపోతే యిబ్బంది పడ తావురా" అని అన్నాను.

"లేదులేబ్బా యిళ్ళల్లోనేవుంటేనే మంచిది. ఒంటిగా సెడ్డులో వుండలేం. తోడుండరు. పైగా ఆడ పిల్లోల్లుందేపని బావి కాడా సెడ్డుకాడా గుడ్డలుతు క్కోవడం - అంతా రోతలేబ్బా. యిళ్ళ ల్లోకి పోతే ఎంతరోతున్నా పరవా లేదు. ఎవరూ చూడరు. చూచినా అందరితో పాటు మేమూ అని అను కొంటారు" అని గంగడు చెప్పినాడు.

"రామిరెడ్డి చెప్పితే పోతున్నా వురా - వూర్లో మీ యిళ్ళలో సరిగా జరక్కపోతే-యిబ్బంది. సెడ్డు మేలురా నీకూ - భయం లేకుండా వుంటుంది. చుట్టూ పట్టూ తోటల్లో పనులు చేసుకో వచుచ" అని అన్నాను.

"రామిరెడ్డితో మాట్లాడు కొంటా లేబ్బా" అని అంతలో తుంచేసినాడు గంగడు.

"ఏరా ఏమన్నా పనిమీద వచ్చి నావా" అని అయిదు రూపాయలు లెక్కా కొన్ని పాత గుడ్డలూ యిచ్చిపంపినాను. గంగనికి వూరట కలిగిందేమో - ఉత్సా హంగా లేచిపోయినాడు.

నెల తిరక్క ముందే - గంగడు ముందున్న వూరినుండి ఒకడొచ్చినాడు. "మీ యింటిని కనుక్కోవడానికి తిరిగి తిరిగి చచ్చిపోయినా" అని అన్నాడు.

"ఏం విషయం" అని అన్నాను,

'వాడుండాడే గంగడు, మూగి పిల్లల నాయన, నీవూ చూచినావు మా వూర్లోవున్నప్పుడు వాడేమైనా నీ వద్దకు వచ్చినాడా" అని అన్నాడు

'ఏమీ ఏమన్నా విశేషమా' అని అన్నాను.

" విశేషమేముందీ - వూర్లో గోవిందరెడ్డి అన్నకు రు. 500/- బాకీ అంట. రాత్రికి రాత్రే చెప్పకుండా చెయ్యకుండా వచ్చేసినాడు యిక్కడ చేరి నీ పాదం పట్టితే సరిపోతుందని అనుకొన్నాడు. దొంగనాయాలు" అని అన్నాడు.

"అంతేనా యింకేమైనావుందా" అని అన్నాడు.

"అది చాలదూ. బాకీకత చెప్ప కుండా తప్పించుకొని తిరిగితే మంచి దాన్నా - నీవే చెప్పు. ఆయన బాకీ ఎట్లారావాల" అని అన్నాడు.

"పని పాటలు చేసి వచ్చిన కూళ్ళల్లో మిగిలించుకొని బాకీ తీరుస్తాడు- యిప్పుడేమైందీ" అని అన్నాను.

"ఎట్లా తీరుస్తాడు - ఎదురుగా వుండి-అంటే-ఆ వూర్లోనే వుండి వచ్చింది వచ్చినట్లూ యిస్తావుంటే తీర్తాది. పారిపోయి వచ్చి యిక్కడ కూడబెట్టి తీరుస్తాడంటే - ఎవరన్నా నమ్ముతారా-అయినా యిట్లా విషయాలు నీ కంతగా తెలియవులే. తెల్లనివన్నీ పాలూ - నల్లనివన్నీ నీళ్లూ అని అను కొంటారు. మీకిట్లాటి విషయాల్లో లోతు తెలియదు" అని అన్నాడు చిరుకోపంగా.

"గోవిందరెడ్డి ఎందుకిచ్చినాడు. అంతమొత్తాన్ని వాడెట్లా తీర్చుకొంటాడు. ఐదు వందల జీతగాడైనా అయిదు వందల అప్పుతీర్చు కోవాలంటే - టౌనులో కష్ట పడుతున్నాడే" అని అన్నాను.

"అయిదారేళ్ళ కింద వంద రూపాయలు యిచ్చినాడంటా. యిప్పటికి వడ్డీతో యింకా ఎక్కువే అయివుంటుం దని అన్నాడు గోవిందరెడ్డి-

"తీర్చలేనోనికి వడ్డీ కట్టుకుంటూ పోతే ఎట్లప్పా". అని వెటకారంగా అన్నాను.

"అది మామూలే కదా. అవస రానికిందిచ్చి నప్పుడు-యిస్తానని ఒప్పు కొన్నాడుకదా. యిచ్చినోవిదేమి తప్పు అని అన్నాడు.

"శక్తిలేనోడు-ఎక్కడా తెచ్చు కోలేని వాడు - మీ యిష్టమబ్బా అని చెప్పివుంటాడు." అది ఒప్పుకోడం ఎట్లవుతుంది యింతకూ యిప్పుడు నన్నేం చెయ్య మంటావు" అని అన్నాను.

"ఏముందీ వాన్ని పంపించు. పూరుచేరుకొని ఎట్లో అప్పు తీర్చు కుంటాడు" అన అన్నాడు.

"నీ పిచ్చిగానీ - వాడెట్లా తీర్చు కొంటాడు. అది కానిపని. వాడు చావ కుండా కొన్నాళ్లు బతికితే గొప్పసంగతి. వాని పెండ్లాము మాత్రం తొందరగా చచ్చేట్లువుంది. యింకా నేదత పిల్లోల్లూ వాళ్ళె పెద్దోల్లయి పనికెదిగితేనే - ఆ కుటుంబం - యింతతిండి, కడుపునిండా తింటారు" అని అన్నాను.

"అయితే గోవిందరెడ్డికి రావల సిన బాకీ పోయినట్లేనా" అని అన్నాడు.

"పోక వస్తుందను కొన్నావా - కాకపోతే వానితో వాని పిల్లలతో ఉప రాగా పనులు చేయించుకోవచ్చు. త్వరగా చచ్చిపోయేట్లు చేస్తారు. డబ్బు మాత్రం రాదు" అని కచ్చితంగా అన్నాను.

"ఏదో ఒకటి చూడన్నా. నీకు నిందవస్తుంది. యితర్లకు బాకీలు ఎగ్గొ ట్టించి తన పనిలో పెట్టుకొన్నా"డని అంటారు - అని సూటిగా అన్నాడు.

'నాకు స్వంత సేద్యం లేదే - నన్నేందుకట్ల అను కొంటారు" అని అన్నాను.

"ఎందుకనుకోరు. ఎంత లేంది తన తోటకాడ పెట్టుకొంటాడా-అందరం రైతులమే - చూచుకొని పోవాల. సన్నోళ్ళకు చనువిచ్చి నెత్తికెక్కించు కొంటే ఎట్లన్నా. గోవిందరెడ్డి అన్న మొత్తుకొంటున్నాడు ' 'నానెక్క ఎట్లా అని ఏదో ఒక పరిష్కారంచెయ్యన్నా. లేకుంటే పెద్ద రాగం పాడాల" అని కటువుగా మాట్లాడినాడు.

"ఏం పరిష్కారముంది. వాడు తీర్చలేడు. కాదంటే వాన్ని కొట్టొచ్చు-తిట్టచ్చు. కుటుంబాని కందరికి బువ్వ పెట్టితే - తిట్టినా-కొట్టినా పడి వుంటాడు. ఊరక పని చేయలేడు. బాకీలు తీర్చ లేడు. అందులో తక్కువ కూళ్ళల్లో, యిది నా అభిప్రాయం. మీరే ఏదో పరిష్కారం ఆలోచించండి" అని అన్నాను.

"నీ పనిలోకి వస్తున్నాడు కదా నీవేసర్దు. బాకీ తీర్చినట్లూ వుంటుంది నీ పని జరుగుతుంది". అని అన్నాడు.

"ముందే చెప్పినాను. నాకు స్వంత సేద్యం లేదని. పాపం వాడు పనులు చేసుకొని బతికేందుకు మాత్రం ఏర్పాటు చేసినాను. అంతే వాని బాకీ నేనెంనుకిచ్చుకోవాల. అందులో వడ్డీలకు వడ్డీల బాబతు లెక్కలు" అని నేనూ కటువుగానే మాట్లాడినాను. అతడు కొంత తగ్గి "ఏమోనబ్బ మీ యిష్టం గోవిందరెడ్డన్ననే పంపుతా ఆయనే మాట్లాడు కొంటాడు" అని లేచి పోయినాడు.

"ఏందిదంతా. వాన్ని పంపిం చేయరాదా" అని మా ఆడవాళ్ళు, మందలించినట్లుగా అన్నారు.

"వారెక్కడికి పోతారు. ఆ వూర్లో జరక్క యీ వూరికి వచ్చినారు. యీ వూర్లో జరక్కపోతే యింకో వూరికి పోతారు. కడకు అడుక్కతిం టారు అదీ వారి బ్రతుకు నేనెట్లాపం పేది. మళ్ళీ ఆటోనులోకి. అయిదారేళ్ళ నుండి వడ్డీకి వడ్డీ కట్టి-సందుకు అయిదు వందలకు ఎగారాసినారు. అంత మొత్తాన్ని వాడెక్కనుండి తెచ్చి కట్టుతాడు. అందుకే దొంగతనంగా వున్న వూరు విడిచి-టిక్కెట్టులేకుండా యీ వూరొచ్చినాడు. నా వల్లకాదు. గోవింద రెడ్డి ఏమైనా చేయాలనుకుంటే బుద్ధి చెప్పుతాను" అని అన్నాను కఠినంగా.

గోవిందరెడ్డి రానే వచ్చినాడు. వారం తిరక్క తలికే, "వాళ్ళింట్లో పేడా కసువు తీసేవాళ్ళు లేరనీ-పనిపాటలు కుంటుపడుతున్నా యని - చెప్పి-అన్నీ తెలిసి అడవిలో పడుతున్నాడే - వాన్ని పంపిచు. నీవు గట్టిగా పట్టినావు. నీ మాటే వింటాను. వాన్ని ఎట్లయినా పిలుచుకొని పోవాలని వచ్చినాను" అని అన్నాడు.

"వాన్నే అడుగు. నాబాకీ కట్ట వద్దులేరా అని అంటే పరవారతా వస్తాడు. మన పనికి ఠరమయ్యేవాన్ని వత్తితే యింతే జరుగుతుంది." అని అన్నాను.

"ఉరుపు యీకుండానా-ఎందన్నా అర్థమన్నా యీకుంటే ఎట్లా నీవే చెప్పు. అందుకే నీవు చెప్పి ఒప్పించి పంపుతా వని వచ్చినాను. మనమంతా అయిన పోయినోళ్ళం యిట్లా గట్టిగా పట్టుకుంటే ఎట్లా. సన్నోళ్ళను యిరికించుకొకపోతే పనులెట్లా జరుగుతాయి. అందులో దేశ రిమ్మర్లతో ఎట్లా పనులు చేయించుకో వాల్నో నీకు తెలియదా" అని నవ్వుతూ అన్నాడు.

"పనికి మాలిన ఆలోచనలతో నన్నెందుకు చంపుతావు. నీ నూరు రూపాయాలూ ఏనాడో తీరిపోయి వుం టుంది. నీకు పని జరగాలంటే-వాన్ని ఆదరంగా చూసుకో-అట్లయితేనే పం పుతా-అని అన్నాను. "నీ యిష్టం-అట్ట నేకానీ" అన్నాడు

"ఏమైనా వారం రోజుల్లో వచ్చేట్లు చెయ్యన్నా-నీ దగ్గర చేరినాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే వాన్ని ఏమి చేసిందునో" అన్నాడు.

"ఏమి చెయ్యొద్దు-యీవలసినంతా కూలిచ్చి ఆదరంగా చూసుకో. అంతే లేకుంటే-అవస్థలు పడతావు. వాళ్ళకూ సంఘాలున్నాయి వాళ్ళకూ దిక్కు న్నారు. వాళ్ళిప్పుడేమీ ఊరుకోరు. ఊరక లేరు" అని అన్నాను.

ఎట్లనోలే అన్నా-కాలం తప్పి కందులు గుగ్గిళ్ళవుతున్నాయి. ప్రతి జుట్టు మాసినోడు సంఘాల్లో చేరడమే సంఘాలకు మీ యట్లా పని లేనోళ్ళు సాయంగా వుండనే వుంటారు. మాకు తెలియదా అని గోవిందరెడ్డి లేచి పోయి నాడు.

గంగడు వారం రోజులకు తోట వద్ద నుండి వచ్చినాడు. "ఏరా గంగా గోవిందరెడ్డి వచ్చి-నీవు రాయించిన బాండు యిచ్చి-20/ రూపాయలు చార్జీ లకూ యిచ్చి పోయినాడురా. బాకీ లేదంటలే పోతావా-ఎప్పుడు పోతావు" అని అన్నాను

"పోలేనబ్బా రామిరెడ్డి మం చోడు-నాకొక పాత కొట్టం కొనిచ్చి నాడు నూటాయాభై కే యిప్పించినాడు. విన్నానే రిజిష్టరు చేయించినానబ్బా, కొట్టం కొంప దొరికింది. తోట దొడ్డి వున్న వూరు. పనులుంటాయి. ఆడ పిల్లోళ్ళకు పెళ్ళిల్లన్నా చేసి చచ్చిపోతా నబ్బా అందాకా పాత కొట్టంలో తల దాచు కొంటాను" అని అన్నాడు.

"మువ్వ మళ్ళా కూరుకున్నావు గదరా పనికి మాలినోళ్ళు ఏమైనా చేస్తారు. ఎదుర్కొనే శక్తి వుండాలి. ఇక్కడి వాళ్ళతో తకరారు వస్తే ఎట్లరా గోవిందరెడ్డి కావలసినోడు కాబట్టి విన్నాడు అని అన్నాను.

"అట్లానాబ్బా! రామిరెడ్డిమంచో డనుకొంటినే" అని గొనుక్కుంటూ కూలబడిపోయినాడు గంగడు.